క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

బనగానపల్లె : మండలంలోని నందవరం గ్రామంలోని శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధికి నంద్యాల జిల్లా మూలసాగరంకు చెందిన బుడిగి రామగోపాల్, సునీత కుటుంబ సభ్యులు రూ.50,001లను విరాళంగా అందజేసినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి ఆదివారం తెలిపారు. దాతలను పూలమాల దుశ్శాలువాతో ఘనంగా సన్మానించి అమ్మవారి ప్రసాదం ఆలయ అర్చకులు వేదపండితులు అందజేసినట్లు పీవీకుమార్‌రెడ్డి తెలిపారు.

ఆలయంలో విగ్రహ ఏర్పాటుకు ..



విరాళం అందజేస్తున్న దాతలు

డోన్ టౌన్ : ఉడుములపాడు గ్రామ సమీపంలోని సోంపురం రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న శనేశ్వరస్వామి ఆలయంలో ప్రతిష్ఠించేందుకు పట్టణానికి చెందిన బచ్చు శ్రీనివాస దంపతులు, కుటుంబ సభ్యులు మూల విరాట్ విగ్రహాన్ని విరాళంగా అందజేశారు. ఆదివారం ఆలయ పూజారి విహారి స్వామిని కలిసి విగ్రహం కోసం అయ్యే ఖర్చును నగదు రూపంలో అందజేశారు. కార్యక్రమంలో విగ్రహదాత కుటుంబ సభ్యులు బచ్చు రవి, పురందేశ్వరి దంపతులు, బచ్చు చక్రి తదితరులు ఉన్నారు.

కూలిన మట్టి మిద్దె



ఆకుమల్లలో వర్షానికి కుంగిన మట్టిమిద్దె

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామంలో కొద్దిరోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి గ్రామానికి చెందిన బలిజ చంద్రుడు ఇంటి మిద్దె కూలిపోయింది. ఆ సమయంలో కూలిన గదిలో కూకుండా మరో గదిలో చంద్రుడు, కుటుంబ సభ్యులు ఉండటంతో ప్రమాదం తప్పింది. అధిక వర్షాలు కురుస్తుండంతోమట్టిమిద్దెలలో నివశిస్తున్న ప్రజలు సురక్షిత భవనాలలో చేరుకోవాలని తహసీల్దార్ అనిల్ కుమార్ హెచ్చరించారు.

రోగులకు పౌష్టికాహారం పంపిణీ



రోగులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న దృశ్యం

డోన్ : వంద పడకల ప్రభుత్వాసుపత్రిలో ఆదివారం గర్భిణులు, బాలింతలు, రోగులు, వారి సహాయకులకు పౌష్టికాహార పంపిణీ కార్యక్రమం జరిగింది. స్వాతంత్ర్య సమరయోధులు సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని పురస్కరించుకొని రామక్రిష్ణగౌడ్ ఆర్థిక సహాయంతో పౌష్టికాహార పంపిణీ జరిగింది. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు జాన్ ప్రభాకర్, రాజేష్ పాల్గొన్నారు.

మాలిక్‌బాబా సంస్థాన్ కమిటీ ఎన్నిక



ఐపీ వెంకటేశ్వర్లు

డోన్: స్థానిక రామచంద్ర మాలిక్ బాబా సంస్థాన్ కమిటీ నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఆదివారం ఎన్నుకున్నారు. రిటైర్డు పీఈటీ ఐపీ వెంకటేశ్వర్లు అధ్యక్షుడిగా, ఉపాధ్యక్షుడిగా చలపతిరావు, ప్రధాన కార్యదర్శిగా సీనియర్ న్యాయవాది నరసింహులు ఎన్నికయ్యారు. సంస్థాన్ ఆధ్వర్యంలో ఇప్పటికే ప్రతి గురువారం నిత్యాన్నదానం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలను చేపట్టేందుకు నిర్ణయం తీసుకుంటున్నట్లు నూతన అధ్యక్షులు వెంకటేశ్వర్లు తెలిపారు.

శేషారెడ్డి పాఠశాల కరస్పాండెంట్‌కు సన్మానం



బుగ్గన నాగభూషణంరెడ్డిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

బేతంచెర్ల : పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాల కరస్పాండెంట్, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డిని 2003–04 బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థులు సన్మానించారు. ఆదివారం ఆయన స్వగృహానికి వెళ్లి జ్ఞాపికను అందజేసి, శాలువ పూలమాలతో సత్కరించారు. రావు బహదూర్ బీపీ శేషారెడ్డి బేతంచెర్ల పట్టణానికి ముందు చూపుతో విద్య, వైద్య రంగాలకు అమూల్యమైన సేవలు అందించారని, శేషారెడ్డి ఉన్నత పాఠశాల ఉండటంతో తాము ఈ స్థాయికి ఎదిగామని పూర్వ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

మతసామరస్యానికి ప్రతీక

- గూటుపల్లె పెద్దరాజుస్వామి దర్గాకు 600 ఏళ్ల చరిత్ర
- ఈనెల 20 నుంచి ఉరుసు ఉత్సవాలు
- వేలాదిగా తరలిరానున్న భక్తులు



ఉత్సవాలకు ముస్తాబైన దర్గా ముఖద్వారం



గూటుపల్లె పెద్ద రాజు స్వామి దర్గా



స్వామివారి సమాధి

బేతంచెర్ల : మతసామరస్యానికి ప్రతికగా చారిత్రక నేపథ్యం కల్గి వేలాది మంది భక్తులు దర్శించేది గూటుపల్లె పెద్ద రాజు స్వామి దర్గా. మండల పరిధిలోని గూటుపల్లె గ్రామంలో వెలసిన శ్రీ హజరత్ సయ్యద్‌షా అబ్దుల్ రహమాన్ ఇద్రూస్‌బాషా ఉరఫ్ పెద్దరాజు స్వామి వారి ఉరుసును అన్ని మతాల వారు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. ఈనెల 20, 21, 22 తేదీల్లో మూడు రోజుల పాటు ఉరుసు ఘనంగా నిర్వహించనున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చి మొక్కలు చెల్లించుకుంటారు.

శతాబ్దాల చరిత్ర కలిగిన పెద్ద రాజుస్వామి దర్గా

పెద్దరాజుల స్వామి 600 వందల సంవత్సరాల క్రితం సౌది అరేబియా దేశంలోని జిద్దా సమీపంలో గల అదన్ పట్టణంలో సయ్యద్ అబూబకర్ సక్రాన్ ఇద్రూస్ వలి మక్కికు జేష్ఠ పుత్రుడిగా జన్మించారు. లోక కల్యాణార్థం పెద్దరాజుస్వామి 9 సంవత్సరాల వయస్సులోనే తన తల్లిదండ్రులను వదిలిపెట్టి భారతదేశానికి వచ్చి మొట్ట మొదట కర్ణాటక రాష్ట్రంలోని బీజాపూర్‌లో కొన్ని సంవత్సరాలు నివాసం ఉండి.. అనంతరం ఆదోని పట్టణానికి వచ్చారు. తదనంతరం స్వామివారు అక్కడి నుంచి గూటుపల్లెకు వచ్చారు. ఇద్రూస్‌బాషాకు ముగ్గురు భార్యలు. వీరిలో ఇద్దరు భార్యలకు సంతానం లేదు. మొదటి భార్యకు ముగ్గురు సంతానం కాగా వారిలో ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. అయితే అక్కడంతా దట్టమైన అడవి ఉండేది. ఈ ప్రాంతంలో యాదవులు ఆవులు, గొర్రెలు మేపుతూ జీవనం చేసేవారు. స్వామివారు తన తండ్రి ఆజ్ఞానుసారం చేతికర్రను తీసుకొని గూటుపల్లెలో నేడు ఉన్న దర్గా స్థలంలో నాలుగు రకాతులు నమాజు చేసిన తర్వాత మిస్వాక్ పుల్ల వేయగా అది మొక్కగా మారింది. ఆ వెంటనే రాత్రి పాతిన ఆసా తీసి వాసన చూడగా తన స్వగ్రామమైన ఆదోని భూమి వాసన వచ్చిందని, తన తండ్రి కూడా ఇదే స్థిర నివాసం అని చెప్పడంతో స్వామి కూడా ఇక్కడే నివాసముండేందుకు గూటుపల్లె గ్రామ ఏర్పాటుకు సంసిద్ధులయ్యారు. ఇక్కడ గ్రామం ఏర్పాటు చేసి ఖుదాపల్లె అని నామకరణం చేశారు. కాలక్రమేణా అదే గూటుపల్లెగా మారింది. స్వామివారికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుని సంతతే ఇప్పుడు ఉన్న పీఠాధిపతుల వంశం.

స్వామివారి మహిమలు

ఇద్రుస్ బాషా ఉరఫ్ పెద్ద రాజు గూటుపల్లెలో స్థిర నివాసం నిర్ధారణ అయిన తరువాత గొర్రెల కాపరుల భయం పోగొట్టెందుకు కొండపై ఉన్న పులులను కొండ తీగలతో కట్టి తీసుకొని రావడంతో వీరికి పెద్దరాజు అని పేరు వచ్చింది. అందువల్ల ఆయనను పెద్దరాజు స్వామిగా పిలుస్తున్నారు. ప్రతి గురువారం పెద్ద పులి వచ్చి తనతోకతో గర్భగుడిని శుభ్రం చేసేదని చరిత్ర చెబుతుంది. దర్గ ఆవరణలో దెయ్యం, భూతం, పిశాచి పీడలు కలవారు ఒక్క రోజు నిద్ర చేస్తే పీడల తొలిగిపోతాయని గ్రామస్తుల విశ్వాసం.

వేల ఎకరాల మాన్యం రాసిచ్చిన ఔరంగ జేబు

మొఘల్ సామ్రాజ్యపతనానికి కారకుడైన ఔరంగ జేబు కూడా 1681లో ఈ గ్రామాన్ని సందర్శించినట్లు చరిత్ర చెబుతుంది. ఈ సమయంలోనే ఔరంగ జేబు.. పెద్దరాజస్వామికి వేలాది ఎకరాల మాన్యం ఇచ్చినట్లు రికార్డులు తెలుపుతున్నాయి.

దర్గాకు 13 వ పీఠాధిపతి సయ్యద్ అక్బర్ బాషా ఖాద్రీ



ఎంతో చరిత్రాత్మకమైన ఇద్రూసాబాషా దర్గాకు నేటికి 13 మంది పీఠాధిపతులుగా వ్యవహరించారు. 16 సంవత్సరాల క్రితం 12వ పీఠాధిపతి అయిన సయ్యద్ హాఖాని బాషా అకాల మరణంతో వంశ పారంపర్యంగా పీఠాధిపతిగా అతని కుమారుడైన సయ్యద్ అక్బర్ బాషా ఖాద్రీ 6 సంవత్సరాల వయస్సులో 13వ పీఠాధిపతిగా బాధ్యతలు చేపట్టాడు. విశేషమేమిటంటే గూటుపల్లె పీఠంతో పాటు భారత దేశంలోని 90 పీఠాలకు ఈయన పీఠాధిపతిగా వ్యవహరిస్తున్నారు.

ఉరుసుకు ప్రత్యేక ఏర్పాట్లు

కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నట్లు దర్గా నిర్వహకులు గురు సయ్యద్‌షా బాష ఖాద్రి తెలిపారు. 20న గంధం, 21ఉరుసు, 22 జియారత్ ఉత్సవాలు ఉంటాయన్నారు. ఈ ఉత్సవాలకు రాష్ట్రంలోని భక్తులే కాకుండా ఇతర రాష్ట్రల నుంచి వేలాది మంది భక్తులు హాజరై తమ మొక్కులను తీర్చుకుంటారు.

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ అనంతరావు తెలిపారు. అమడాల, గుంజలపాడు, జోళదరాశి, గుళ్లదుర్తి, పొట్టిపాడు, హరివరం, అల్లూరు, కొత్తపల్లె, కలుగొట్ల, కొప్పెర్ల, రేవనూరు ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ ఉంటుందన్నారు.

- **సంజామల:** మండలంలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటిపూట తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. ముక్కమల్ల, ఆల్వకొండ, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపూరి, ముదిగేడు, కానాల, అక్కంపల్లె, గిద్దలూరు, ఆర్. లింగందిన్నె, రామిరెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ వివరించారు.

రైతులందరికీ ‘అన్నదాత సుఖీభవ’ వర్తింపజేయాలి

బేతంచెర్ల : ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అర్హులైన రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింపజేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు అధ్యక్షతన మండల 3వ మహాసభ జరిగింది. సీనియర్ రైతు నాయకులు క్రిష్టారెడ్డి జెండాను ఆవిష్కరించారు.

మాదసుపల్లెలో ప్రత్యేక వైద్య శిబిరం

బనగానపల్లె రూరల్ : మండలంలోని మాదసుపల్లె గ్రామంలో పలువురికి వైరల్ జ్వరాలు రావడంతో టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సోహెల్‌బాబు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో వర్షాలు కురుస్తున్నాయని, ప్రజలు తమ ఇళ్లు, పరిసరా ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వలేకుండా చర్యలు తీసుకోవాలని, దోమతెరలను తప్పనిసరిగా వాడాలన్నారు. అలాగే మంచినీటిని వేడి చేసుకొని తాగాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమల నివారణ ద్రావణాన్ని పిచికారీ చేయించారు. శిబిరంలో 8 మందికి రక్త పరీక్షలు మరో 50 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ఎంపీహెచ్ఓ ఓబులేసు, హెచ్ఈ సరస్వతి, హెచ్ఎస్ వెంటరమణ తదితరులు పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సోహెల్‌బాబు

పెద్దకొప్పెర్లలో కార్డన్‌సెర్చ్



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ హనుమంతునాయక్

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో పెద్ద కొప్పెర్లలో ఆదివారం కోవెలకుంట్ల సీఐ హనుమంతునాయక్ ఆధ్వర్యంలో రేవనూరు, కోవెలకుంట్ల ఎస్ఐలు భూపాలుడు, మల్లికార్జునరెడ్డి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని అనుమానితుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులనుద్దేశించి సీఐ మాట్లాడుతూ ఇటీవల కాలంలో జరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానిత వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందజేయాలని సూచించారు.

మీర్జాపురంలో ..

కొలిమిగుండ్ల: మండలంలోని మీర్జాపురంలో సీఐ రమేష్‌బాబు సిబ్బందితో కలిసి కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ముందుగా గ్రామంలోని ప్రధాన వీధుల్లో కవాతు నిర్వహించారు. పలువురు అనుమానితుల ఇళ్లలో సోదాలు చేశారు. వాహనాల తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. గ్రామంలో నాటుసారా, బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మహాసభలను జయప్రదం చేయండి

బేతంచెర్ల : ఒంగోలు పట్టణంలో ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర నాయకులు రామాంజనేయులు, నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం బేతంచెర్ల పట్టణంలోని కొత్తబస్టాండు నుంచి పాతబస్టాండు మీదుగా పోలీస్ స్టేషన్ వరకు సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ ఆధ్వర్యంలో జన సేవాదళ్ కవాతు నిర్వహించారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

డోన్ టౌన్: ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు ఒంగోలు పట్టణంలో జరిగే సీపీఐ రాష్ట్ర 28వ మహాసభలకు కార్యకర్తలు, సానుభూతిపరులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకయ్య, డోన్ పట్టణ కార్యదర్శి మోటా రాముడు, మండల కార్యదర్శి నారాయణ, ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు కొయిలకొండ నాగరాజులు పిలుపునిచ్చారు. స్థానిక నక్కి రామన్న భవన్‌లో ఆదివారం రాష్ట్ర మహాసభల పోస్టర్లను విడుదల చేసారు. వారు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్నాయన్నారు.



బేతంచెర్లలో జనసేవాదళ్ కవాతు

మూతపడిన అర్బన్ హెల్త్ సెంటర్



మూతపడిన అర్బన్ హెల్త్ సెంటర్

డోన్: పట్టణ నడిబొడ్డున రైల్వేస్టేషన్ రహదారి పక్కన ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్ తరచూ మూతవేసి ఉండటంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ పనిచేసే వైద్యులు, సిబ్బంది విధులు సక్రమంగా నిర్వర్తించకపోవడం వల్ల మూడు కిలోమీటర్ల దూరంలోని వంద పడకల ప్రభుత్వాసుపత్రికి వ్యయప్రయాసాలకోర్చి వెళ్లాల్సి వస్తోందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిసర ప్రాంతాల్లోని ప్రైవేటు ఆసుపత్రులకు ప్రయోజనం కలిగించేందుకే ఇక్కడ సిబ్బంది, వైద్యులు విధులకు సక్రమంగా హాజరుకావడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిష్టాత్మకంగా పట్టణ నడిబొడ్డున నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్ల పరిస్థితి ఇలా ఉంటే గ్రామీణ ప్రాంతాల్లోని హెల్త్ సెంటర్ల పరిస్థితి ఎలా ఉంటుందో ప్రజాప్రతినిధులు గ్రహించాలని ప్రజలు కోరుతున్నారు.



కోవెలకుంట్ల సమీపంలో నీట మునిగిన పైర్లు

వదలని వర్షాలు

కోవెలకుంట్ల: అల్పపీడన ప్రభావంతో స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని పలు మండలాల్లో మూడు రోజుల నుంచి వర్షాలు కొనసాగుతున్నాయి. ఆదివారం సబ్ డివిజన్‌లోని అవుకు మండలంలో 13.2 మి.మీ, సంజామల మండలంలో 11 మి.మీ, కోవెలకుంట్ల మండలంలో 9.2 మి.మీ, కొలిమిగుండ్ల మండలంలో 8.4 మి.మీ, ఉయ్యాలవాడ మండలంలో 7.6 మి.మీ, దొర్నిపాడు మండలంలో 6.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఆయా మండలాల వ్యవసాయాధికారులు తెలిపారు.

విద్యా ప్రచార ఉద్యమం విజయవంతం చేయాలి

బనగానపల్లె రూరల్ : ఆంధ్ర విద్యా ఉద్యమం– అన్వేషించండి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనేషన్ ఆఫ్ ఇండియా(ఎస్ఐఓ) జిల్లా అధ్యక్షులు యాసిన్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎస్ఐఓ కార్యాలయంలో ఎస్ఐఓ ఆధ్వర్యంలో ఆంధ్ర విద్యా ఉద్యమం అన్వేషించండి, ప్రోత్సహించు, సాధికారత అనే ఉద్యమ పోస్టర్ల ఆవిష్కరణ జరిగింది. జిల్లా ఎస్ఐఓ అధ్యక్షులు యాసిన్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఐఓ ఆధ్వర్యంలో చేపట్టిన నెల రోజుల ప్రచార ఉద్యమంలో భాగంగా విద్యార్థులను ఉన్నత విద్య, అకాడమిక్ ఎక్సలెన్స్ కోసం ప్రేరేపించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐఓ నాయకులు ఫయాజ్, అవేజ్, జహీర్, తౌఫిక్ తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణ.. ముగ్గురికి గాయాలు

కోవెలకుంట్ల: మండలంలోని జోళదరాశి ఎస్సీ కాలనీలో ఆదివారం ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. గ్రామంలోని సీఎస్ఐ చర్చి ఎన్నికల నిర్వహణపై చర్చి పాస్టర్లు ఇరువర్గాల వారితో చర్చలు జరిపారు. ఎన్నికలు జరపాలని ఒక వర్గం, వద్దని మరో వర్గం ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో ఒక వర్గానికి చెందిన మద్దయ్య, జయరాజు, బంగారక్కపై మరో వర్గానికి చెందిన వ్యక్తులు రాళ్లు, కట్టెలతో దాడి చేశారు. ఈ దాడిలో మద్దయ్య తీవ్రంగా గాయపడటంతో కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించారు. మరో ఇద్దరు స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామంలో ఇరువర్గాల మధ్య చోటు చేసుకున్న వివాదంపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్ : మండలంలోని దేవరబండ సబ్ స్టేషన్ పరిధిలోని మిద్దేపల్లె ఫీడర్ కింద రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో 11 కేవీ పనులు జరుగుతున్న కారణంగా సోమవారం మిద్దేపల్లె, అనుంపల్లె, రేకులకుంట, దేవరబండ గ్రామాలకు ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ నాగేశ్వరరెడ్డి ఆదివారం తెలిపారు. రైతులకు ఇచ్చే త్రీఫేస్ కరెంటు తెల్లవారు జామున 3 నుంచి ఉదయం 10 గంటల వరకు, మరలా సాయత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు ఇస్తామని పేర్కొన్నారు.

ప్రశంసా పత్రాల ఎంపికలో అన్యాయం

డోన్ టౌన్ : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో అందించే ప్రశంసా పత్రాల్లో దళిత, బీసీ ఉద్యోగులకు, కులస్తులకు, స్వాతంత్ర్య సమరయోధులకు అన్యాయం చేశారని జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబరు ఏఈ నాగరాజు ఆరోపించారు. స్థానిక ముక్తేశ్వర ఆలయంలో ఆదివారం జరిగిన వినియోగదారుల హక్కుల పరిరక్షణపై అవగాహన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గతంలో జనవరి 26న గణతంత్ర దినోత్సవ వేడుకల్లో అన్యాయం జరిగిందన్నారు. ఈ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న రెవెన్యూ, పోలీసు అధికారులను జిల్లా కలెక్టర్, ఎస్పీ ఎంపిక చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఉద్యోగంలో చేరిన నెల రోజులకు ప్రశంసా పత్రాలు అందించారని ఆరోపించారు. కేవలం ప్రజాప్రతినిధులు సిఫార్సు చేసిన వారికే ప్రశంసా పత్రాలు అందించడం బాధాకరమన్నారు. సమావేశంలో పట్టణ వినియోగదారుల సంఘం నాయకుడు శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

ఉమామహేశ్వరస్వామిని దర్శించుకున్న కర్నూలు జేసీ

బనగానపల్లె రూరల్ : మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయాన్ని కర్నూలు జాయింట్ కలెక్టర్ బి నవ్య ఆదివారం దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ ఈఓ పాండురంగారెడ్డి, ఆలయ అర్చకులు ఆలయ ప్రధాన ద్వారా నుంచి పూర్ణ కుంభంతో ఘనస్వాగం పలికారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఆలయంలో ఏకశిలారూపంలో కొలువైన శివపార్వతులకు అభిషేకం అర్చన తదితర ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం జాయింట్ కలెక్టర్‌కు దుశ్శాలువా పూలమాలతో సన్మానించి స్వామి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో యాగంటిపల్లె ఉపసర్పంచ్ బండి మౌలీశ్వరరెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



జేసీ బి.నవ్యకు స్వామి చిత్ర పటం అందజేస్తున్న ఆలయ ఈఓ

వాటర్‌షెడ్ పనుల్లో నిధుల దుర్వినియోగం



వాటర్‌షెడ్ ఏపీఎంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీపీ రాజశేఖర్ రెడ్డి

డోన్ : మండలంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వాటర్ షెడ్ పథకంలో కూటమి అధికారంలోకి వచ్చాక అధికార పార్టీ నేతలు, అధికారులు ఇష్టారాజ్యంగా చేపట్టి నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి ఆరోపించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బాబాఫకృద్దీన్ అధ్యక్షతన ఆదివారం స్థానిక పంచాయతీరాజ్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. మండలంలోని ఎద్దుపెంట, యాపదిన్నె, ఉంగరానిగుండ్ల పంచాయతీల పరిధిలో వాటర్‌షెడ్ పనులను సర్పంచ్, ఎంపీటీసీల ప్రమేయం లేకుండా, కమిటీల తీర్మానం లేకుండానే పనులు చేపట్టినట్లు రికార్డులు రాసుకున్నారని.. పనులు చేసిందేమిటో చెప్పాలని వాటర్‌షెడ్ ఏపీఎం విజేతను ఎంపీపీ నిలదీశారు. ఇంతవరకు ఎక్కడెక్కడ ఏఏ పనులు చేశారు, ఎన్ని లక్షల నిధులు ఖర్చు చేశారో వివరించాలని కోరగా.. ఏపీఎం సమాధానం చెప్పలేక నీళ్ల నమిలారు. దీంతో రేగటి రాజశేఖర్ రెడ్డి వాటర్‌షెడ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రమేయం లేకుండానే పనులు చేపడుతున్నారని, ఆయా గ్రామ ఎంపీటీసీ సభ్యులు లక్ష్మంపల్లె ఓబులేసు, వైస్ ఎంపీపీ ఎర్రిస్వామి సభ దృష్టికి తీసుకువచ్చారు. భవిష్యత్తులో ఆరోపణలకు తావు లేకుండా నిష్పక్షపాతంగా పనులు చేపట్టాలని వాటర్‌షెడ్ అధికారులకు ఎంపీపీ సూచించారు.

పీఎస్‌ల గైర్హాజరుపై ఆగ్రహం

మండల సర్వసభ్య సమావేశాలకు మండలంలోని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు గైర్హాజరు కావడం పట్ల ఎంపీపీ రాజశేఖర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో గైర్హాజరైన వారికి నోటీసులు అందజేయడమే కాక జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, విద్యుత్ శాఖ ఏఈ నాగేశ్వర రెడ్డి, వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





ఆర్ఎస్ రంగాపురంలో శ్రీకృష్ణుడి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం, యంబాయిలో కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

కల్యాణం.. కమనీయం

బేతంచెర్ల : మండల పరిధిలోని యంబాయి గ్రామంలో వెలసిన వేణుగోపాల స్వామి ఆలయంలో శ్రీకృష్ణాష్టమి సందర్భంగా రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం ఆలయ ఈఓ మద్దిలేటి, అర్చకులు పవనయ్య ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను కొలువుంచి మంగళవాయిద్యాల నడుమ కల్యాణం జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమతి హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడికి పల్లకీ సేవ నిర్వహించారు. మండల పరిధిలోని సిమెంట్ నగర్ గ్రామ సమీపాన కృష్ణమ్మ కొనలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు కనుల పండువగా నిర్వహించారు. స్వామివారికి ఊయల సేవ చేపట్టారు. ఉత్సవాలను పురస్కరించుకొని భజన పోటీలను నిర్వహించారు.

జ్ఞాపకాల జడివాన..

ఒకే వేదికపై చేరిన 2002-03 పదో తరగతి పూర్వ విద్యార్థులు



కోవెలకుంట్ల: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. పాఠశాలలో 2002–03లో పదవ తరగతి విద్యార్థులు ఆత్మీయ కలయిక కార్యక్రమం ఆనందంగా సాగింది. ఆ విద్యా సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన 75 మంది విద్యార్థులు తర్వాత ఉన్నత చదువులు చదివి హైదరాబాదు, కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాలు చేస్తూ స్థిరపడ్డారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనంతో వారంతా ఒక చోట చేరి అప్పటి జ్ఞాపకాలు, మధుర స్మృతులు, అల్లరి చేష్టలను గుర్తు చేసుకున్నారు. అనంతరం అప్పట్లో విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు వీరబ్రహ్మం, రాజయ్య, నారాయణరెడ్డి, మోహన్‌రెడ్డి, సుమతి, జీవీ సుబ్బారెడ్డి, వెంకటరాముడు, నాగేంద్రారెడ్డి, సరోజ, వసుంధర, శ్రీనివాసరెడ్డి, స్వయం ప్రభ, నాగేశుడును ప్రత్యేకంగా ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులైన డీసీ ఉసేన్ బాబు, ఉసేన్‌వలి, లోకేశ్వరరెడ్డి, అబ్దుల్‌సలాం, మహమ్మద్ రఫీ, సుదర్శన్‌రెడ్డి, చెన్న కేశాలు కార్యక్రమ కో ఆర్డినేటర్లుగా వ్యవహరించారు.